నవోదయ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ టి అరుణకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ పాఠశాల కేంద్రంలో జరుగు ఈ పరీక్షకు మొత్తం 144 మంది విద్యార్థులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఉదయం 10 గంటలకు ఆధార్ కార్డు, హాల్ టికెట్ తీసుకొని రావాలని కోరారు.

సమాధాన పత్రాలతో నిరసనలు

డుంబ్రిగుడలో సంజాయిషీ నోటీసులతో నిరసన చేపడుతున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి- విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు జిల్లాలో సమ్మెను కొనసాగించారు. అధికారులు ఇచ్చిన షోకాజ్ నోటీసులపై సంజాయిషీ ప్రతులను అధికారులకు అందజేశారు. పలు చోట్ల ర్యాలీలు చేపట్టారు.

డుంబ్రిగుడ: కేంద్రంలోని హైవే రోడ్డు యూనియన్ బ్యాంక్ జంక్షన్ నుంచి మూడు రోడ్ల జంక్షన్ మీదుగా ఐసిడిఎస్ కార్యాలయం వరకు అంగనవాడీలు ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ కార్మికులకు ఇచ్చిన నోటీసులకు గాను సంజాయిషీ పత్రాలతో నిరసన చేపట్టి ఐసిడిఎస్ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే.కొండమ్మ, సత్యవతి, పవిత్ర పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలో అంగన్‌వాడీలు సమ్మెను కొన సాగించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ మండల యూనియన్ నాయకురాలు పి.మంజుల, సిహెచ్.కళావతి, కె.లక్ష్మీ, ఎస్.సుమిత్ర, అరుణ కుమారి పాల్గొన్నారు

హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్వాడి టీచర్లు చేస్తున్న సమ్మె గురువారం 38వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం అందించిన సమ్మె నోటీసులను చూపుతూ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం సమ్మె నోటీసులపై సమాధానాలను స్థానిక సిడిపిఓకు యూనియన్ నాయకులు తెలిపారు.

రాజ ఒమ్మంగిలో...

కొనసాగిన అంగన్‌వాడీల ఆందోళనలు

ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించమని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు. అప్పలకొండమ్మ, కృష్ణవేణి పద్మ, కుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు: స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడి కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాధ్, ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు ఎంఎం శ్రీను మాట్లాడుతూ, ప్రభుత్వం సమస్యలను పరిష్కారం చేయకుండా షోకాజ్ నోటీసులు జారీ చేసి భయభ్రాంతులకు గురి చేస్తుందని విమర్శించారు. యూనియన్ నాయకులు ఎస్.ఈశ్వరమ్మ, ఎస్.కాంతమ్మ, మౌళమ్మా, సుజాత, భవాని, సత్యవతి, కుమారి, చిలకమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పెదబయలు: మండలంలో అంగన్వాడీల సమ్మె కొనసాగింది. ప్రభుత్వం ఇచ్చిన నోటీసులకు సమాధాన పత్రాలు ఇచ్చేందుకు వెళ్లగా ప్రాజెక్ట్ అధికారిని లేక పోవడంతో సూపర్‌వైజర్స్‌కు అందించారు. ముందుగా సమ్మె ప్రాంగణం నుండి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు టి.రాజమ్మ మాట్లాడుతూ, సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు. సీఐటీయూ జిల్లా నాయకులు బోండా సన్నిబాబు, మండల కమిటీ బోండా గంగాధరం, చెట్టి పద్మ, మంగ, కొండమ్మ, సుశీల, శాంతి, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటలో...

షోకాజ్ నోటీసులకు సమాధానాలు

అడ్డతీగల: మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపట్టిన ఆందోళన 38వ రోజు కొనసాగింది. షోకాజ్ నోటీసులపై అంగన్వాడీలు సమాధానాలు ఇచ్చారు. అడ్డతీగల పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. షోకాజ్ నోటీసులకు రాతపూర్వకంగా సమాధాన పత్రాలను ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేసి, రసీదులు పొందారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వెంకట్, యూనియన్ నాయకులు బి నిర్మల, బేబీ రాణి పాల్గొన్నారు.

కూనవరం : మండలంలోని భీమవరం క్రాస్ రోడ్డు నుండి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి, తమకు ప్రభుత్వం ఇచ్చిన షోకాజ్ నోటీసుకు సమాధానం రాతపూర్వకంగా అందజేశారు. సిఐటియు నాయకులు కొమరం పెంటయ్య, పూనెం సత్యనారాయణ మాట్లాడుదారు. సీఐటీయూ నాయకులు సుబ్బారావు, పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా సమ్మె శిబిరం వద్ద నుండి ఐసిడిఎస్ కార్యాలయం వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి, బైఠాయించారు. షోకాజ్ నోటీసులకు రాతపూర్వక సమాధానం ఐసిడిఎస్ సిడిపిఓ దేవామణికి అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు, డివైఎఫ్ఐ నాయకులు టి శ్రీను, యూనియన్ నాయకులు కె వెంకటలక్ష్మి, సిహెచ్ కుమారి, ఎల్ సత్యవతి, రమణి, రమణ, రత్నం, చిన్నమ్మలు సుందరమ్మ, నాగమణి, రాధా, భవాని, రాజేశ్వరి, లక్ష్మి, వీరయ్యమ్మ, వీరలక్ష్మి పాల్గొన్నారు.

పిఆర్.పురం : మండలంలోని రేకపల్లి జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు దీక్షలు 38వ రోజుకు చేరాయి. శిబిరాన్ని జడ్పిటిసి వాళ్ల రంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి ముత్యాల రామారావు, టిడిపి నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. అలాగే అంగన్వాడీలకు ప్రభుత్వం షోకాజ్ నోటీసులు ఇవ్వడంపై ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్ ఎదుట నిరసన తెలిపి, రాత పూర్వక సమాధానం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సున్నం రంగమ్మ, రాజేశ్వరి, కనకమహాలక్ష్మి పాల్గొన్నారు.

కూనవరంలో..

మారేడుమిల్లి : నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు ప్రభుత్వం జారీ చేసిన షోకాజ్ నోటీసులకు బదులుగా గురువారం మండలంలోని అంగన్వాడీలు పంచాయతీ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద నుండి ఐసిడిఎస్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఐసిడిఎస్ సిడిపిఓ ప్రసన్న విశ్వనాథ్‌కి లిఖితపూర్వకంగా సమాధానాలు ఇచ్చి వారి నుండి నకలు తీసుకున్నారు. అంగన్వాడీలకు జనసేన, టిడిపి నాయకులు మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గురుకు శేషు కుమార్, రాజ్ కుమార్, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలో అంగన్వాడీల ఆందోళన 38వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు వై అప్పలనాయుడు మాట్లాడుతూ నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు ముత్యాలమ్మ, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ సూరిబాబు, అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో...

సదస్సులో మాట్లాడుతున్న ఎంపీడీవో వీర కిషోర్

అభివృద్ధి ప్రణాళికలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మారేడుమిల్లి

జిపిడిపి గ్రామపంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై మారేడుమిల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు ఎంపీటీసీలతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఏ.వీర కిషోర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో ఉన్న నిధులను ఏ పనులకు ఉపయోగించాలో అభివృద్ధి ప్రణాళిక చేసుకోవడం, గ్రామ కమిటీలు ఏర్పాటు చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో మండల పరిషత్తు అధ్యక్షురాలు సార్ల లలిత కుమారి, మండల విస్తరణాధికారి డి.విజయ్ కుమార్, పంచాయతీ సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా వైయస్ షర్మిలను నియమించడంతో పార్టీకి పూర్వ వైభవం వస్తుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు కార్య శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. సీలేరులో గురువారం జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి కుమార్తె వైయస్ షర్మిలను పిసిసి అధ్యక్షులుగా, మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజును సిడబ్ల్యూసికి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వైయస్ షర్మిల పిసిసి అధ్యక్షులుగా రావడంతో ఇతర పార్టీల్లో ఉన్న అసంతృప్తి యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ కార్యకర్తలు వి.అప్పారావు, ఎం.సత్తిబాబు, రాంబాబు, మల్లు దొర, మాజీ సర్పంచులు బాబురావు అల్లంకి, రాజు తదితరులు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ఇద్దరు వైద్యాధికారులకు షోకాజ్ నోటీసులు

-ఈదులపాలెం పిహెచ్‌సిని తనిఖీ చేసిన పిఒ

ప్రజాశక్తి-పాడేరు: విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలోని ఈదులపాలెం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఆసుపత్రి రికార్డులు, హాజరు పట్టికలను పరిశీలించారు. పి. హెచ్.సి. వైద్యాధికారులు ఇద్దరు విధులకు హాజరు కాలేదని ఆగ్రహం వ్యక్తం చేసారు. వైద్యులు శ్రీను, ఎం.నరసింహలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ఒపి రిజిష్టరును తనిఖీ చేసారు. మందుల నిల్వలపై ఆరా తీసారు. పి. హెచ్.సి పరిధిలో ఉన్న గర్భవతులు ఎంతమంది ఉన్నారని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గర్భవతులకు రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రసవ సమయానికి వారం రోజుల ముందుగా ఆసుపత్రిలో చేర్పించి సుఖ ప్రసవం జరిగేలా వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్య సిబ్బంది గిరిజనుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. ఈనెల 22 న సోమవారం 300 మొబైల్ టవర్లను ముఖ్యమంత్రి పర్చువల్ విధానంలో ప్రారంభిస్తారని ప్రాజెక్టు అధికారి అభిషేక్ చెప్పారు. పాడేరు మండలం ఈదులపాలెం, డుంబ్రిగుడ మండలంలో ముఖ్యమంత్రి పర్చువల్‌గా ప్రారంభిస్తారని చెప్పారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సభ ఏర్పాటు స్థలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇఇ డి.వి. ఆర్. ఎం.రాజు, డిఇ అనుదీప్, రిలయన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు పాడేరులో స్పందన

ప్రజాశక్తి-పాడేరు: జగనన్నకు చెబుదాం స్పందన ప్రత్యేక కార్యక్రమం పాడేరు ఐటిడిఎ సమావేశ మందిరంలో ఈనెల 19న శుక్రవారం యధావిధిగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు లో జరుగనున్న స్పందనకు ప్రజలు హాజరై వారి సమస్యలను అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

వైస్ ఎంపిపికి మాతృవియోగం

ప్రజాశక్తి-హుకుంపేట: మండల పరిషత్ వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు తల్లి లచ్చుమ్మ(58) గత కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ గురువారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో మృతి చెందారు. శుక్రవారం ఉదయం అంత్యక్రియలను మండలంలోని గన్నేరుపుట్టు పంచాయితీ డొంకిన వలసలో జరుగుతాయని కుటుంబ సభ్యులు మజ్జి చిట్టిబాబు తెలిపారు. కుటుంబం సభ్యులను సీపీఎం, సీఐటీయూ గిరిజన సంఘ నేతలు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

గిరిజన సంక్షేమ శాఖ అవుట్ సోర్సింగ్ కార్మికుల యూనియన్ మహాసభలో సిఐటియు నేత వెంకట్

ప్రజాశక్తి-రంపచోడవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పరిధిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఔట్ సోర్సింగ్ కార్మికుల యూనియన్ మహాసభ గురువారం మండల కేంద్రంలో జరిగింది. గిరిజన సంకేమ హాస్టళ్లలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు కొత్తగా 289 మంది సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన మహాసభలో వెంకట్ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు ఔట్ సోర్సింగ్ కార్మికులు శ్రమటోర్చి భోజనాలు వండి పెడుతున్నారని, కాని కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఔట్ సోర్సింగ్ కార్మికులు శ్రమను ప్రభుత్వం, ఐటిడిఎ దోసుకుంటున్నారని విమర్శించారు. 60 ఏళ్ల పాటు సేవలు అందించినప్పటికీ చాలీచాలని జీతాలతో పాటుగా రిటైర్మెంట్ అయ్యేటప్పుడు కనీసం ఎటువంటి బెనిఫిట్స్ ఉండటం లేదన్నారు. సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయాల్సిన ప్రభుత్వం ఆప్కాస్‌లో కలిపి, రెగ్యులర్ అయ్యే గైడ్‌లైన్సు లేదని చెప్పడం దుర్మార్గమన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే వర్కర్లకు ఇచ్చే వేతనాలు మాత్రం పెరగడం లేదన్నారు. ఉదయం 4గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు రోజులో దాదాపు 15 గంటల పాటు పని చేస్తున్న వీరికి కనీస వేతనాలు కూడా ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కనీస వేతనాలు రూ.26000 చెల్లించాలని, ఉద్యోగ భద్రత, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వర్కర్ల పోస్టులను భర్తీ చేయాలని, విధుల్లో చనిపోయిన కార్మికుడు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, మెడికల్ సెలవులు, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో సిఐటియు ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్

కమిటీ ఎన్నిక

ఈ మహాసభలో 25 మందితో కమిటీని, 11మందితో ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకోవడం జరిగింది. యూనియన్ గౌరవాధ్యక్షులుగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, అధ్యక్షులుగా సోడి దుర్గారావు, ప్రధాన కార్యదర్శిగా కారం శ్రీనుబాబు, కోశాధికారిగా గిరిబాబు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎమ్.వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు కె.శాంతిరాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈ.సిరిమల్లిరెడ్డి, వర్కర్లు వీరయ్య, చంద్రమ్మ, పుల్లమ్మ, నాగేశ్వరరావు. వెంకటేశ్వర్లు, చిన్నిబాబు, కుమారి, బాలమ్మ, రమాదేవి, తిరుపతమ్మ, వెంకన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని భారత విప్లవ కమ్యూనిస్టు పార్టీ నాయకులు జుత్తుక కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపుకు గురైన గ్రామాల్లో నిర్వాసితులకు నేటికీ పరిహారం అందకపోవడంతో సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిహారం కోసం నిర్వాసితులు ఎన్ని అర్జీలు పెట్టుకున్న సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించే ప్రయత్నం చేయడం లేదన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్వాసితులకు ఇదే పరిస్థితులు ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు పరిహారం అర్హత కలిగి ఉన్న ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని పరిశీలించకుండా ఏదో ఒక కుంటి సాగు చెప్పి కాలం గడిపేస్తున్నారని పేర్కొన్నారు. ఉపాధి, ఉండటానికి ఇల్లు లేకపోయినా అధికారులు ఎంక్వైరీకి వచ్చి పరిహారం ఇస్తారన్న ఆశతో నిర్వాసితులు ఇక్కడే మగ్గిపోతున్నారని తెలిపారు. సబ్ కలెక్టర్ గతంలో అధికారుల మాదిరి కాకుండా నిర్వాసితుల పట్ల క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి అర్హులైన వారికి పరిహారం అందే విధంగా చర్యలు చేపట్టాలని కుమార్ డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న జుత్తుక కుమార్

ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యురాలికి పుస్తకం అందజేస్తున్న బాలు

ఎన్‌హెచ్‌ఆర్‌సి సభ్యురాలిని కలిసిన బాలు

ప్రజాశక్తి-రంపచోడవరం

హ్యూమన్ రైట్స్ వాచ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు అక్కిస బాలు గురువారం న్యూఢిల్లీలోని జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు సాయానీ విజయ భారతిని కలిశారు. ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ ప్రాంతంలో పర్యటించాలని ఆమెను కోరినట్లు, అందుకు ఆమె సానుకూలంగా స్పందించినట్లు బాలు అక్కిస తెలిపారు.

20న రాస్తారోకోలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనకాపల్లి

తమ సమస్యలపై అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు పిలుపుమేరకు 20న జరుగు రాస్తారోకో కార్యక్రమాలను జయప్రతం చేయాలని కార్మిక, రైతు సంఘాల నాయకులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ వైఎన్.భద్రం, రైతు సంఘం జిల్లా నాయకులు కొరుబిల్లి శంకర్రావు మాట్లాడారు. గత 38 రోజులుగా అంగన్వాడీలు సమ్మెలో ఉన్నారని, వీరి సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతుంటే జీతం పెంచేది లేదని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ ఛార్జీలు పెంచిందని, కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్ ధరలు పెంచిందని, నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకీ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీలు చేస్తున్న పోరాటం న్యాయమైందని అంగన్వాడీల పోరాటం మద్దతుగా అందరూ జిల్లా వ్యాప్తంగా రాస్తారోకోలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న సిఐటియు అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

తాగునీటి సౌకర్యం కల్పనలో నిర్లక్ష్యం

సిపిఎం ఆధ్వర్యాన ఖాళీ బిందెలతో మహిళల నిరసన

ఊటగెడ్డ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ప్రజాశక్తి -అనంతగిరి : మారుమూల గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని సిపిఎం నేతలు మండిపడ్డారు. గురువారం మండలంలోని పెద్దబిడ్డ పంచాయతీ గొప్పులవలస గ్రామంలో సిపిఎం బృందం పర్యటించింది. ఈసందర్భంగా గిరిజనులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఊటగెడ్డల్లోని కలుషిత నీటిని వినియోగిస్తూ, తాగునీటికి గిరిజనం పడుతున్న కష్టాలపై చలించిపోయారు. ఈసందర్భంగా గిరిజన మహిళలతో కలిసి, ఊటగెడ్డ వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టి, ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వంతల. బుద్రయ్య, కోనేపు చిన్నయ్య, శొటంరి పొట్టన్న మాట్లాడుతూ, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు వంటి కనీస మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గుప్పులవలస గ్రామంలో రక్షితమంచినీటి సౌకర్యం లేకపోవడంతో స్థానిక గిరిమహిళలు కిలోమీటర్ దూరంలో ఉన్న ఊటగెడ్డలోని కలుషిత నీటిని తీసుకొచ్చి వాటిని తాగడంతోపాటు ఇతర అవసరాలను తీర్చుకోవాల్సిన దుస్థితి రావడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలెన్ని మారినా, నేతలు, అధికారులు ఎందరు వచ్చినా గుప్పులవలస వంటి అనేక గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాగునీటి సమస్య ఇంత తీవ్రంగా ఉంటే, మున్ముందు వేసవిలో గిరిజనుల పరిస్థితి ఏమిటో ఇప్పటికైనా గిరిజనులు అర్థం చేసుకోవాలన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు స్పందించి, ఏజెన్సీలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం వద్ద ఖాళీబిందెలతో ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో గ్రామస్తులు పటం సుమిత్ర, జన్ని కొండలమ్మ, జన్ని అప్పారావు, కె.రంభ పాల్గొన్నారు.

సామాజిక సమతా యోధుడు అంబేద్కర్

- ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్

సమతా ర్యాలీని ప్రారంభించి, పాల్గొన్న పిఒ అభిషేక్, జెసి కార్తీక్

ప్రజాశక్తి- పాడేరు: సామాజిక సమతా యోధుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ అన్నారు. గురువారం సామాజిక సమతా సంకల్పంలో భాగంగా పాత బస్‌స్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్‌తో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. పాత బస్‌స్టాండ్ నుంచి ఐటిడిఎ కార్యాలయం వరకు సమతా సంకల్ప ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటిడిఎ సమావేశ మందిరంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19న విజయవాడలో ముఖ్యమంత్రి జగన్ ప్రారంభిస్తారన్నారు. ప్రపంచంలోని పలు దేశాల రాజ్యాంగాలన్నీ అధ్యయనం చేసి. దేశ పరిపాలనకు అవసరమైన రాజ్యాంగాన్ని అంబేద్కర్ రూపొందించారన్నారు. 75ఏళ్లయినా భారత రాజ్యాంగంలో ఎటువంటి సమస్యలు తలెత్తలేదంటే, అది అంబేద్కర్ గొప్పతనానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగంలో అందరికి సమాన అవకాశాలు హక్కులు కల్పించారని, అందుకే అంబేద్కర్ విగ్రహానికి స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అని పేరు పెట్టారన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఎపిఒ వి.ఎస్. ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ఎస్‌డిసి వివిఎస్ శర్మ, ఇఇ డివిఆర్ఎం.రాజు, డిఇఇ. ఒ.గౌరీశంకర్, డిఎల్‌డిఒ డి.శాంతలక్ష్మి, డిఎల్‌పిఒ పిఎస్.కుమార్, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి పాల్గొన్నారు.

వడ్డాదిలో యువకునిపై దాడి ఘటనలో

ఏడుగురు నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : వడ్డాది సినిమా థియేటర్ వద్ద ఈనెల 16న బుర్ర దుర్గతేజపై దాడి చేసిన ఘటనలో ఏడుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు అనకాపల్లి డిఎస్‌పి సుబ్బరాజు తెలిపారు. గురువారం బుచ్చయ్యపేటలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనకు సంబంధించి భూపతి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు, దర్యాప్తు అనంతరం నిందితులపై ఐపిసి 307 హత్యాయత్నం, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిందితులు ఎ.శ్రీరామ్, కొరసాల గణేష్, వెలుగుల సాయికుమార్, మాకాల త్రినాథ్, గండం ప్రసాద్, వెలుగుల సురేంద్రలను కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు. గ్రామంలో వివాదాలకు ఆస్కారం లేకుండా ఇరువర్గాలతో శాంతికమిటీల ఏర్పాటుతోపాటుపోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, బుచ్చయ్యపేట ఎస్ఐ డి ఈశ్వరరావు ఉన్నారు.

విశాఖ 'ఉక్కు'ను కాపాడుకుందాం

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరమైతే, విశాఖ తన ఉనికికే కోల్పోయే ప్రమాదం ఉన్నందున విశాఖ ఉక్కును అందరం సమిష్టిగా పరిరక్షించుకుందామనిఒఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.అప్పారావు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో గురువారం 1071వ రోజు రిలే నిరాహార దీక్షలో ఒఎస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టే పోరాటానికి తాము పూర్తి మద్దతునిస్తున్నామని స్పష్టం చేశారు.

35వ వార్డులో ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖపట్నం) : విశాఖ దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు, దుర్గాలమ్మ ప్రసాద్ గార్డెన్స్ ప్రాంతంలో అర్థ శతాబ్దంపైగా నివాసముంటున్న వారికి ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్ల పట్టాలను గురువారం వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్ల పట్టాల సమస్యను లబ్ధిదారులతో కలిసి జిల్లా కలెక్టర్, ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళ్లి, రిజిస్ట్రేషన్ హక్కు గల పట్టాలను సాధించగలిగామన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్ వూషూ ఛాంపియన్‌షిప్ పోటీల్లో నర్సీపట్నం నుండి ఏడుగురు వూషు ఫైటర్స్ పాల్గొంటున్నారని జిల్లా హైస్కూల్ క్రీడా అధ్యాపకులు దేవి తెలిపారు. ఈనెల 19 నుండి 22 వరకు తమిళనాడులో జరిగే పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం తరపున రాజారాజేశ్వరి, శర్వాణి, శరణ్య, నివేదిత, బిందు, శ్రీదివ్య, హారిక, అంకిత పాల్గొంటున్నారని పేర్కొన్నారు.సబ్ జూనియర్, జూనియర్ బాలికల కేటగిరిలో చెట్టుపల్లి జిల్లా హై స్కూల్‌కి చెందిన ముగ్గురు బాలికలు ప్రతి రోజూ సర్టిఫికెట్లు తీసుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు నరసింహారావు, నిరంజన్ ఆంధ్రా ఉషా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ బోలెం శివ, వూషు సీనియర్ కోచ్ యర్రా శేఖర్ అభినందించారు.

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ విజేత 'రావికమతం'

ప్రజాశక్తి - రావికమతం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ ఉత్సాహంగా ముగిసింది. మండలంలో 24 సచివాలయాల పరిధిలో జరిగిన పోటీలలో మండల స్థాయిలో ఫైనల్‌కు కొత్తకోట సచివాలయం, రావికమతం సచివాలయం టీములు అర్హత సాధించాయి. మొదటగా బ్యాటింగ్ చేసిన కొత్తకోట 8 ఓవర్ల ముగిసే సమయానికి 33 రన్స్ చేశారు. రావికమతం సచివాలయం 34 రన్స్ చేసి విజయం సాధించింది. దీంతో జోనల్ స్థాయికి అర్హత సాధించారు.

నిధుల లేమితో నిర్మాణంలో అలసత్వం.!

దుంబ్రిగుడలో నిర్మాణంలో ఉన్న ఏకలవ్య పాఠశాల భవనం

- ఐదేళ్లయినా పూర్తికాని ఏకలవ్య పాఠశాల భవనం
- పరాయిపంచన అరకొర వసతితో విద్యార్థుల అవస్థలు
- తాజాగా ఫిబ్రవరి గడువుతో పనుల్లో మళ్లీ కదలిక
- ప్రహరీ సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రుల మొర

ప్రజాశక్తి -దుంబ్రిగుడ : లక్ష్యం ఘనమైనా, ఆచరణలో నిర్లక్ష్యం, అలసత్వం ఏకలవ్య పాఠశాలల పాలిట శాపంలా మారుతోంది. గిరిబాలలకు సమగ్ర విద్యను అందించాలన్న సంకల్పంతో కేంద్రప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకలవ్య పాఠశాలలకూ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మండల కేంద్రమైన డుంబ్రిగుడలో ఏకలవ్య పాఠశాలలను ప్రారంభించి ఏళ్లుగడుస్తున్నా, నేటికీ సరైన వసతి లేదు. దీంతో పరాయిపంచన కాలం వెల్లదీస్తూ, సవాలక్ష ఇబ్బందులతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోని పరిస్థితి ఉంది. ఏకలవ్య భవన నిర్మాణాలకు నిధుల లేమి సమస్య అవరోధం కావడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.
మండల కేంద్రమైన డుంబ్రిగుడలో ఏకలవ్య పాఠశాల ప్రారంభించి ఆరేడేళ్లు గడుస్తున్నా నేటికీ వసతి సమస్య వెంటాడుతూనే ఉంది. సొంత భవనం లేని పరిస్థితుల్లో అరకులోయలోని వైటిసి భవనంలో దీన్ని నిర్వహిస్తున్నారు. ఏకలవ్య పాఠశాలకు వసతి సౌకర్యం కల్పనకు సొంతభవన నిర్మాణాలను 2019లోనే ప్రారంభించినా, నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం, అలసత్వంతోపాటు సంబంధిత అధికారులు, ప్రభుత్వ చిత్తశుద్ధిలేమితో నేటికీ పూర్తికాని పరిస్థితి ఉంది. ఏకలవ్య పాఠశాల నిర్మాణంలో జాప్యానికి నిధుల లేమి కారణమని తెలుస్తోంది.

నిర్మాణ పనుల్లో మళ్లీ కదలిక

గత ఎన్నికలకు ముందు ప్రారంభమైన నిర్మాణం, కొంత వరకు జరిగిన తర్వాత నిలిచిపోగా, మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పనుల్లో కదలిక వచ్చింది. ఫిబ్రవరిలోగా ఏకలవ్య పాఠశాల భవనాలను పూర్తి చేయాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇటీవల నిర్మాణ పనులను వేగవంతం చేశారు. ఇప్పటికే ఒక ఆకారానికి వచ్చిన భవనాలకు ప్రస్తుతం టైల్స్, పుట్టితో పాటు తలుపులు, కిటికీల ఏర్పాటు, వైరింగ్, ప్లంబింగ్ వంటి పనులను చేపడుతున్నారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు కొంతవరకు బిల్లులు చెల్లించడంలో పనుల్లో కదలిక వచ్చినా, పెండింగ్ బిల్లులతోపాటు ఇపుడు చేపడుతున్న పనులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తేనే నిర్దేశిత గడువులోగా ఏకలవ్య భవన నిర్మాణాలు పూర్తవుతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు ఇప్పటికే పున:ప్రారంభించిన పనులు మరింత వేగవంతం చేసి, పూర్తయ్యేవరకు కొనసాగించేలా సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి : విద్యార్థులు,తల్లిదండ్రులు

ప్రస్తుతం నిర్మాణ పనులు సాగుతున్న ఏకలవ్య పాఠశాల భవనాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. తాజాగా ఫిబ్రవరి గడువులో పనులన్నీ చురుగ్గా సాగుతున్న నేపథ్యంలో పనిలోపనిగా ప్రహరీని పూర్తిచేయాలని కోరుతున్నారు. ఏకలవ్య పాఠశాలకు ఒకవైపునున్న కొండతో వన్యప్రాణుల భయం ఉండగా, మరోవైపు జాతీయరహదారి ఉండడంతో బయట వ్యక్తులు లోపలికి ప్రవేశించే అవకాశంతోపాటు, ఏకలవ్య విద్యార్థులు అటుగా వెళితే, హైవేలోని వాహనాలతో ప్రమాదం పొంచి ఉందనే ఆందోళన వ్యక్తమౌతోంది. ఈ నేపథ్యంలో ఏకలవ్య భవన నిర్మాణాలతోపాటు దానికి ప్రహరీ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి, వసతికష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

శ్రీనుతో దళిత నేతల ములాఖత్

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఎయిర్‌పోర్టులో జగన్మోహన్‌రెడ్డిపై కోడి కత్తితో దాడిచేశాడని ఆరోపణలు ఎదుర్కొంటూ రిమాండ్ ఖైదీగా విశాఖ కేంద్రకారాగారంలో ఉంటున్న జనిపిల్లి శ్రీనివాస్‌ను దళిత నేతలు గురువారం కలిశారు. తనకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ కేంద్రకారాగారంలో జనిపిల్లి శ్రీనివాస్ నిరసన చేపడుతున్నాడన్న సమాచారంతో విదసం ఐక్య వేదిక నేతలు గురువారం ఆయనను కలిసి నిరసనకు సంఘీభావం తెలిపినట్లు విదసం ఐక్య వేదిక నేతలు తెలిపారు.

శ్రీనివాసరావు దీక్షకు జైలు బయట సంఘీబావం తెలుపుతున్న విదసం నేతలు

జైలు బయట సంఘీభావం

కేంద్రకారాగారంలో శ్రీనివాస్ నిరవధిక దీక్ష చేస్తున్నాడన్న సమాచారంతో ఆయనకు మద్దతుగా విదసం ఐక్య వేదిక నేతలు గురువారం కేంద్రకారాగారం బయట సంఘీభావం తెలిపారు. కోడికత్తి కేసులో జగన్మోహన్‌రెడ్డి కోర్టుకు హాజరవ్వాలని, దళిత యువకుడు శ్రీనివాస్‌పై ప్రభుత్వం వివక్ష నశించాలని ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడుతూ, కోడి కత్తి కేసులో న్యాయం కోసం శ్రీనివాసరావు గాంధేయ మార్గంలో నిరాహార దీక్ష ప్రారంభించారన్నారు. ఈ నిరసనలో విదసం నాయకులు ఎస్ఆర్.వేమన, సుధాకర్, హరిబాబు, బూల భాస్కరరావు, శామ్యూల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి

పాడేరు, రంపచోడవరం, విఆర్.పురంలలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు ఈశ్వరి, సీతంశెట్టి, బాబూరమేష్, టిడిపి నేతలు

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అన్న నందమూరి తారకరామారావు 28వ వర్ధంతిని అల్లూరి జిల్లాలోని పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని చోట్ల రోగులు, అంగన్వాడీలు పండ్లు పంపిణీ, మరికొన్ని చోట్ల పేదలకు దుప్పట్లు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలను నిర్వహించారు.

(ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం)

దుంబ్రిగుడ: టిడిపి వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి. రామారావు వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు టి.సుబ్బారావు, టిఎన్‌టియుసి అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఎం.స్వామి, సీనియర్ నాయకులు కె.సుబ్బారావు, మాజీ ఎంపిపి దన్నిరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

జిఒ3 తెచ్చిన ఘనత ఎన్‌టిఆర్‌ది : గిడ్డి ఈశ్వరి

పాడేరు టౌన్: షెడ్యూల్ ప్రాంతంలోని ఉద్యోగాలన్నీ శతశాతం స్థానిక గిరిజనులకే చెందేలా జిఒ3 తీసుకొచ్చిన ఘనత ఎన్‌టిఆర్ దేనని పాడేరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఎన్‌టిఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకుని, పాడేరులో ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి నేతలు, పార్టీ శ్రేణులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరిజనుల సాధికారితకు ఎన్‌టిఆర్ తీసుకొచ్చిన జిఒ 3ను రద్దుచేయడం ద్వారా గిరిజనానికి తీరని అన్యాయం జరుగుతున్నా, దాన్ని పునరుద్ధరించడంతో వైసిపి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోందని ఆక్షేపించారు. పేదలకు పక్కా ఇల్లు, రూ.రెండుకే కిలో బియ్యం, డ్వాక్రాసంఘాలు, ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్‌టిఆర్ అని కొనియాడారు.కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు ఎర్ర వేణుగోపాల్, రాజమండ్రి నారాయణ, మాజీమంత్రి మణికుమారి, గబ్బాడ సింహాచలం, వెంకటరమణ, సురేష్ కుమార్, విశ్వనాథం, గంగపూజారి శివకుమార్, బుద్ధ జ్యోతికిరణ్, కుమారి, సుబ్బారావు, విజయరాణి, రామ్ నాయుడు, అశ్విన్, కోటి, మూర్తి, వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

విఆర్.పురం : మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు వర్ధంతి సందర్భంగా స్థానిక రేఖపల్లిలో ఎన్టీఆర్ విగ్రహానికి మాజీ జెడ్‌పిటిసి ముత్యాల రామారావు, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు ఆచంట శ్రీనివాస్, బురక కన్నారావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి వచ్చి సంక్షేమ రాజ్యాన్ని తీసుకొచ్చిన ఘనత ఎన్టీఆర్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి, ఎంపిటిసి వాళ్ల వెంకటేశ్వర రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఎండి రహీం, తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బొర్రా నరేష్, ఎస్‌టి సెల్ రాష్ట్ర కార్యదర్శి సవలం రాజేంద్రప్రసాద్, ఎస్‌టి సెల్ జిల్లా కార్యదర్శి పాయం రామారావు, నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షులు బీరక సూర్యప్రకాశరావు, నియోజకవర్గ ఎస్‌సి సెల్ కార్యదర్శి అచ్చి రాజ్, మాజీ మండల అధ్యక్షులు గొంది చంద్రయ్య, మల్లికార్జున రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కారం సిరమయ్య, బురక సారయ్య, ముత్యాల రమేష్ , మాజీ సొసైటీ చైర్మన్ ముత్యాల చంద్రశేఖర్, ఉప సర్పంచ్ దుర్గారావు పాల్గొన్నారు.

కొయ్యూరు: : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహానుభావుడు ఎన్‌టి రామారావు అని టిడిపి ఎస్‌టి సెల్ మాజీ అధ్యక్షుడు ఎంవివి ప్రసాద్ కొనియాడారు.కొయ్యూరులో టీడీపీ ఆధ్వర్యంలో నిఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ రామరాజ్యం రావాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. పేదలకు బట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల నేత డి.చిట్టిబాబు లతా భీమరాజు, శ్రీనుబాబు పాల్గొన్నారు.

మారేడుమిల్లి: మారేడుమిల్లి ప్రధాన కూడలిలో ఎన్‌టిఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో గర్భిణులకు, అలాగే 38రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లాల రాజ్‌కుమార్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు గురుకు శేషుకుమార్, ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు మారేడుమిల్లి జనసేన అధ్యక్షులు మల్లా దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు భీశెట్టి సత్య, మాజీ మండల అధ్యక్షులు భీశెట్టి అప్పాజీ, మండల ఉపాధ్యక్షులు కర్రి సన్యాసిరెడ్డి మండల ఉపాధ్యక్షులు దూడ సువర్ణ, కర్ణ కుమార్, తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి విండెల గోపి, ఎంపిటిసిలు కొరగాని సువర్ణ రాజు, సాధన గున్నమ్మ, సర్పంచులు వీరబల్లి జార్జ్‌బాబు, సాధల ప్రేమ్‌కుమార్ రెడ్డి, మండ రత్నాజీచ తెలుగు యువత ఉపాధ్యక్షుడు కె.కృష్ణ, షేక్ మస్తాన్, పుచ్చల ఎలమంద పాల్గొన్నారు.

రంపచోడవరం : ఎన్‌టిఆర్ 28వ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేద్కర్ సెంటర్లో ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్ పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. తెలుగుజాతి అభ్యున్నతికి, తెలుగువారి ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడానికి అన్న ఎన్‌టిఆర్ చేసిన కృషిని కొనియాడారు.
కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు, కారం సురేష్‌బాబు జనసేన మండల అధ్యక్షులు శ్రీను, మండల ప్రధాన కార్యదర్శి పెంటపాటి అనంతమోహన్, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు గొర్లె సునీత, అరకు పార్లమెంటు ఎస్టీ సెల్ అధ్యక్షులు కారం సింహాచలం, రంపచోడవరం నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు వై.నిరంజని దేవి, గ్రామ కమిటీ అధ్యక్షులు దిండి జనార్ధన్, తెలుగు యువత మండల అధ్యక్షులు సిద్ధ వెంకన్న దొర, మండల బీసీ సెల్ అధ్యక్షులు బొడ్డేటి వీరబాబు, మాజీ మండల అధ్యక్షులు ధారా వెంకన్న, కొండ్రు సక్రపాణి, సత్య, పెంటమ్మ, గల్లా సత్తిబాబు, పండ బాబి, కొంచెం బాపన్న, కోసు నాగన్న దొర, అయినాల పెద్దకాపు, సురేష్, సారపు రాంబాబు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ, కొయ్యూరు, మారేడుమిల్లి కేంద్రాల్లో ఎన్‌టిఆర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న టిడిపి, జనసేన నేతలు, అభిమానులు

రైతుబజారులో స్టాళ్ల కేటాయింపునకు

27న విశాఖ కలెక్టరేట్‌లో డ్రా

ప్రజాశక్తి -పాడేరు: విశాఖ నగరంలోని రైతు బజార్లలో స్టాల్స్‌ను అల్లూరి జిల్లాలోని గిరిజన రైతులకు కేటాయింపునకు ఈ నెల 27న డ్రా ఉంటుందని విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ కె. విశ్వనాథన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు స్పందన ద్వారా, వ్యక్తిగతంగా, ఇంకా ప్రజాప్రతినిధుల ద్వారా దరఖాస్తులు చేసుకొన్న 786 మంది రైతులలో 315 మంది రైతులకు డ్రా తీయాల్సి ఉండగా, కొందరు గిరిజన రైతులు హాజరు కానందున, 235 మందికి మాత్రమే ఈ నెల 12న దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీశామన్నారు. ఈ నెల 27 ఉదయం 10 గంటలకు విశాఖపట్నం కలెక్టరేట్ సమావేశ మందిరంలో దరఖాస్తుదారుల సమక్షంలో బహిరంగంగా డ్రా తీసి, 233మంది జాబితా నుంచి 80 మంది గిరిజనులకు రైతుబజార్లలో స్టాళ్లను కేటాయిస్తామన్నారు.. డ్రా తీయబోయే స్టాల్స్, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.
ఎంపికైన రైతులు తమకు నామినీగా ఉండేందుకు వారి రక్త సంబంధీకులను మాత్రమే డ్రాలో పాల్గొనేందుకు అనుమతిస్తామన్నారు. డ్రాలో స్టాళ్లు పొందిన గిరిజన రైతులు, సాయంత్రం పూట రైతు బజార్లకు వెళ్ళుటకు అంగీకారం తెలపాల్సి ఉంటుందని జెసి స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు విశాఖపట్నంలోని గోపాలపట్నం రైతుబజార్ ప్రక్కనున్న సహాయ మార్కెటింగ్ సంచాలకుల కార్యాలయాన్ని లేదా ఫోన్ నెంబరు 9959592474లో సంప్రదించవచ్చని సూచించారు.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి సిద్ధం

- హుకుంపేట జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం

జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం

ప్రజాశక్తి -హుకుంపేట: అరకు అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు పోటీకి అవకాశం కల్పించాలని స్థానిక జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం అభ్యర్థిస్తున్నాడు. వైసిపి ఆవిర్భావం నుంచి పార్టీకి ఎనలేని సేవలను అందించి, ప్రజల మన్ననలు, ప్రశంసలు పొందిన తనను వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆశీర్వదించాలని కోరారు. అరకు నియోజకవర్గంలోని ఆరు మండలాలలో ప్రజాదరణతోపాటు అన్ని సామాజిక వర్గాల నుంచి మద్దతు తనకు ఉందన్నారు. జెడ్‌పిటిసిగా.ప్రజా సమస్యలపై పట్టు ఉందని, వాటి పరిష్కారానిక నిరంతరం శ్రమిస్తున్నానన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి సామాన్య కార్యకర్తగా ఉంటూ, జెడ్‌పిటిసి స్థాయికి ఎదిగి, నిరంతరం పార్టీ బలోపేతానికి కృషి చేశామన్నారు. ఉపాధ్యాయునిగా ఉంటూనే పార్టీ కోసం ఎనలేని సేవచేశానని, పనిచేసే వారికి ప్రాధాన్యతనిస్తున్న సిఎం జగన్, వైసిపి అధిష్టానం తమ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి, అరకు ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తుందని మత్స్యలింగం అశాభావం వ్యక్తం చేశారు.

కులగణనపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కుల గణనపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని దళిత సేవా పరిరక్షణ (డిఎస్‌పి) జిల్లా అధ్యక్షుడు యాదగిరి దాసు తెలిపారు. గురువారం దాసు ఆధ్వర్యంలో ఆర్‌డిఒ సిహెచ్ జయరామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నర్సీపట్నంలో కుల గణన చేపట్టే ముందు క్షేత్రస్థాయిలో కనీసం అవగాహన కల్పించకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు యమ్.అప్పలరాజు, డిఎస్‌పి మండల నాయకులు మర్రా చిన్ని, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వ్యాన్ దగ్ధం

ప్రజాశక్తి - ఆరిలోవ : బిఆర్‌టిఎస్ రోడ్డులో చినగదిలి సమీపంలో కొత్తగా నిర్మించిన నారాయణ ఆసుపత్రి వద్ద సర్వీసు రోడ్డులో నిలిపి ఉన్న వ్యాన్ గురువారం దగ్ధమైంది. సర్వీసు రోడ్డులో సుమారు ఏడాదిగా నిలిపి ఉన్న ఈ వ్యాన్ దగ్గర గురువారం చిన్నపిల్లలు ఆడుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తూ నిప్పు తగలడంతో ఒక్కసారిగా వ్యాన్ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

ఎదురులేని మనిషి ఆడియో ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కీర్తిశేషులు మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని తెలుగు శక్తి అధ్యక్షులు బివి.రామ్ అన్నారు. అరాచక పాలన కొనసాగిస్తున్న వైసిపిని గద్దె దించేందుకు ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నందమూరి తారకరామారావు 28వ వర్ధంతి సందర్భంగా 'ఎదురు లేని మనిషి' ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం గురువారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తొమ్మిది నెలల్లోనే ఎన్‌టిఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ కూల్చివేసి అధికారంలోకి వచ్చిందని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రంలో ఉన్న ఏకైక అతిపెద్ద పరిశ్రమ విశాఖ ఉక్కును కూడా కాపాడుకోలేకపోతున్న పరిస్థితిలో సిఎం జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని అన్నారు. తొలుత ఆర్కే బీచ్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శివశంకర్, ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జి పసుపులేటి ఉషాకిరణ్, కార్పొరేటర్ కందుల నాగరాజు, పాలూరి శేషుమాంబ, ఆడారి ఉమాశంకర్, తెలుగు మహిళ నాయకురాలు కేదార లక్ష్మి, బొడేపూడి దొరబాబు, జి.జగదీష్, రమణ, మండవ జ్యోతి పాల్గొన్నారు.

358 మందికి ఇళ్ల పట్టాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో 22ఎ లో భూమిలో ఉన్న అర్హులకు ఇళ్ల పట్టాలను అందించినట్లు నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు చెప్పారు. అక్కేపల్లిలోని షాదీ కనెకల్ మండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా 22ఏ లో ఉన్న భూములను అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి అందజేశారని తెలిపారు. మొత్తం 358 మందికి ఇంటి పట్టాలను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరు సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, కార్పొరేటర్లు అనిల్ కుమార్ రాజు, శశికళ, సాడి పద్మారెడ్డి, బర్కత్ ఆలి, చల్ల రజిని, అల్లు శంకరరావు, జోనల్ కమిషనర్ కృష్ణ, తహశీల్దార్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ల సమస్యలపై హైవే దిగ్బంధం

ప్రజాశక్తి -ఆనందపురం : దేశవ్యాప్తంగా లారీ డ్రైవర్లపై కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన జిఒ 106(2) వెంటనే రద్దుచేయాలని కోరుతూ గురువారం ఆనందపురం హైవే బ్రిడ్జిపై డ్రైవర్లు, క్లీనర్ల అసోసియేషన్ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంట్రెటి సూర్యనారాయణ, పూడి అప్పారావు మాట్లాడుతూ, దేశ ఆర్థిక వ్యవస్థకు ట్రాన్స్‌పోర్టు వ్యవస్థ మూలమని, లారీ డ్రైవర్లకు ఇన్స్యూరెన్స్, రిటైర్డ్ అయిన వారికి పెన్షన్ అందించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలా కాకుండా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే డ్రైవర్లకు 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు ఏడు లక్షలు అపరాధ రుసుము చెల్లించాలనడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ప్రమాదాలు జరిగేటప్పుడు డ్రైవర్లను బాధ్యులు చేయడం సరికాదన్నారు. ఆనందపురం మండలం లారీ యూనియన్ అసోసియేషన్ నాయకులు పైడినాయుడు, కిలాని శ్రీను, అప్పలనారాయణ, రమణ తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలతో బెంబేలు

ప్రజాశక్తి -ఆనందపురం : మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆనందపురం శ్రమజీవుల కాలనీలో వరుస దొంగతనాలతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కాలనీలోకి వచ్చి కోళ్లు దొంగతనాలు చేస్తూ పరారవుతున్నారు. మెలకువ వచ్చి లేచేసరికి కోళ్లు పట్టుకొని పారిపోతూ సుదూరంలో బైక్‌పై సిద్ధంగా ఉన్న మరో వ్యక్తితో కలిసి పారిపోతున్నారని బాధితులు తెలుపుతున్నారు. ఆనందపురం భూలోకమాత గుడి కాలనీలో అంగటి అప్పారావు ఇంటి వద్ద కోళ్లను గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి పట్టుకొని పారిపోయారు. ఇటీవల మూడుసార్లు కోళ్లు దొంగతనం జరిగినా దొంగలు దొరకలేదు. ఈ మేరకు బాధితుడు అంగటి అప్పారావు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ప్రజాశక్తి -నక్కపల్లి: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక పై పంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, ఉపాధి, వెలుగు సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ అంబేద్కర్, ఏవో సీతారామరాజు, వైస్ ఎంపీపీ నానాజీ మాట్లాడారు. గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని సూచించారు. అవసరమైన ప్రతి అంశాన్నీ ఆర్థిక ప్రణాళికలో పొందుపరచాలన్నారు.